

పోస్టర్‌ను విడుదల చేస్తున్న జంగయ్య, నాయకులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

శంషాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం సమ్మెకు సంబంధించిన పోస్టర్ స్థానిక నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దుచేసి కొత్తగా లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాల్సిన బాధ్యత కార్మికులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో కే.రామస్వామి, సామిడి శేఖర్‌రెడ్డి. బాతరాజు నర్సింహ, చందుయాదవ్, కే.నర్సింహరెడ్డి, సక్రూనాయక్, నర్రాగిరి, బాబురావు, రాజు, యాదగిరి, మహదేవ్ మల్లేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, భూసేకరణ అధికారి రాజు

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- ఫ్యూచర్ సిటీ రోడ్డు భూ నిర్వాసితులకు భరోసా
- మీర్కాన్‌పేటలో గ్రామ సభ

కందుకూరు, మే9(ఆంధ్రజ్యోతి): రావిరాల ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి కందుకూరు మండలంలోని మీర్కాన్‌పేటలో నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీ వరకు నిర్మించనున్న రోడ్డుకు భూములు కోల్పోయే రైతులను ఆదుకుంటామని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మీర్కాన్‌పేటలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజుతో కలిసి ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రోడ్డుకు పూర్తిస్థాయిలో భూమిని కోల్పోతున్న రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారంతో పాటు ఆ కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి అదనంగా రూ.5లక్షల 50వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అనంతరం రైతులు ఇచ్చిన వినతులు, డిమాండ్లను ఉన్నతాధికారుల కృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపాల్, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కల తొలగింపు

చౌదరిగూడ, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని గాలిగూడ, ధర్మతండా, తుమ్మపల్లి లోని క్రీడా ప్రాంగణాల్లో పేరుకోపోయిన చెత్త, పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'నిర్లక్ష్యం నీడలో క్రీడా ప్రాంగణాలు' కథనానికి అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలను కూలీలతో క్లీన్ చేయించారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తుమ్మలపల్లిలో క్రీడా ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న కూలీలు



వరికే అగ్రస్థానం!

- జిల్లాలో 3.47లక్షల ఎకరాల్లో పంటలు
- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- ఈ సారి 'పత్తి' సాగు భారీగా తగ్గింపు
- అందుబాటులో 43,917 క్వింటాళ్ల విత్తనాలు
- 72,200 టన్నుల ఎరువులు సిద్ధం

వానాకాలం సాగుకు సన్నద్ధం

వానాకాలం సీజన్‌కు సంబంధించిన సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఈసారి రైతులతో వరి పంటను ఎక్కువగా వేయించాలని నిర్ణయించింది. గతంలో కంటే పత్తి సాగును తగ్గించింది. సన్నాలకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుండటంతో అన్నదాతలు కూడా వరి వైపే మొగ్గు చూపుతున్నారు. ఇందుకనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : వచ్చే వానాకాలం (ఖరీఫ్) సీజన్‌కు వ్యవసాయశాఖ పూర్తిస్థాయి సన్నద్ధమవుతోంది. వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 3.47లక్షల ఎకరాల్లో రైతులతో వివిధ పంటలసాగు చేయించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించింది. గత ఏడాదితో పోలిస్తే వరి సాగు పెంచగా, పత్తి సాగు గణనీయంగా తగ్గించారు. పోయిన సారి వానాకాలంలో వరి పంటను 1,00,608 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించగా, ఈ ఏడాది దీన్ని 1,40,238 ఎకరాలకు పెంచారు. సన్నాలకు ప్రభుత్వం రూ. 500 ప్రోత్సాహకం ఇస్తుండటంతో గత వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు అంచనాలకు మించి వరి పంట వేశారు. దీంతో ఈ ఏడాది వ్యవసాయ ప్రణాళికలో వరి సాగు లక్ష్యం గతం కంటే పెంచారు. ఇక గతేడాది అత్యధికంగా 1,77,735 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని

మిగతా 8వ పేజీలో...

వ్యవసాయ ప్రణాళిక (ఎకరాల్లో)

పంట	సాగు విస్తీర్ణ లక్ష్యం
పత్తి	1,29,088
వరి	1,40,238
మొక్కజొన్న	62,207
కంది	9,008
జొన్న	2,762
వేరుశనగ	96
ఇతర పంటలు	4590
మొత్తం	3,47,989



యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణ

- నిర్భయంగా వ్యాపారాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు

7



వ్యవసాయ శాఖ గోడౌన్‌లో నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

నిధులున్నా.. అనుమతులు సున్నా

- అసౌకర్యాల నడుమ నిర్వహణ
- కనీస వసతుల్లేక ఇబ్బందుల్లో న్యాయవాదులు, కక్షిదారులు
- భవన సముదాయానికి రూ.123 కోట్లు మంజూరు
- పరిపాలన అనుమతుల కోసం ఎదురుచూపులు

పక్కా భవనాలకు నోచని కోర్టులు

ఇబ్రహీంపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలో ఏర్పాటైన కోర్టులకు పక్కా భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీస సౌకర్యాలు కొరవడి అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇబ్రహీంపట్నంలో మున్సిఫ్ కోర్టు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఐదు కోర్టులు ఏర్పాటయ్యాయి. వీటికి పక్కా భవనాలు లేకపోవడంతో వ్యవసాయ శాఖ గోడౌన్‌లో ఓ కోర్టు, మండల పరిషత్ కార్యాలయ పాత సమావేశ మందిరంలో మరో కోర్టు, మెజిస్ట్రేట్ క్వార్టర్‌లో ఒకటి, కక్షిదారులు వేచి ఉండే భవనంలో ఒకటి ఇలా వేర్వేరుగా వసతుల లేమితో ఇవి కొనసాగుతున్నాయి. కోర్టుకు వచ్చే కక్షిదారులకు కనీసం తాగునీటి వసతి, టాయిలెట్స్ కూడా అందుబాటులో లేవు. వీరు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ గంటల తరబడి ఆరు బయటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే

మిగతా 8వ పేజీలో...

భవన సముదాయాన్ని త్వరగా నిర్మించాలి



కోర్టు భవన సముదాయాన్ని త్వరితగతిన నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న కోర్టుల వద్ద కనీస వసతులు లేవు. వాహనాల పార్కింగ్ లేక ఇబ్బందిగా ఉంది. అధికారుల క్వార్టర్లు, న్యాయవాదులు, కక్షిదారులు వేచి ఉండడానికి కూడా వసతి లేదు. క్యాంటీన్ సౌకర్యం కూడా లేదు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పరిపాలన అనుమతులు మంజూరు చేసి కోర్టుల కోసం భవన సముదాయం నిర్మించాలి.

- ముద్దం వెంకటేశం, ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

నీళ్లు కావు.. ఎండమావులు!



ఈ ఫొటోను చూస్తే మీకేమనిపిస్తుంది. వర్షం పడటంతో రోడ్డుపై నీరు నిలిచిందనుకుంటున్నారా..? అలాగైతే మీరు పప్పులో కాలేసినట్టే. శుక్రవారం ఎండ దంచికొట్టింది. అధిక ఉష్ణోగ్రతలకు శంషాబాద్‌లోని సర్వీసు రోడ్డుపై ఇలా ఎండమావులు ఏర్పడ్డాయి.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

సోవియట్ యూనియన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు తీవ్రతరం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): సోవియట్ యూనియన్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. హిట్లర్ ఫాసిజంపై నాటి సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం విజయం సాధించి 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫాసిజం, సామ్రాజ్య ధోరణులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని తిరిగి 12గంటల పని విధానాన్ని తీసుకువచ్చిందంటూ విమర్శలు చేశారు. సమ్మె హక్కులు లేకుండా చేస్తున్నారని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరిగిపోతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. పేదలకు విద్య, వైద్యం అందించాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా అప్పులతో రాష్ట్రం దివాళా తీసిందనడం సరికాదన్నారు. భారత్, పాక్ యుద్ధ సమయంలో హైదరాబాద్‌లో అందాల పోటీలను నిర్వహించడం అవసరమా అని ప్రశ్నించారు. ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం పూర్తి మద్దతు నిస్తుందని ఆయన తెలిపారు. అలాగే 30న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట చేపట్టనున్న ధర్నాకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, నాయకులు భాస్కర్, సామేల్, జగదీష్, నర్సింహ, జగన్, చంద్రమోహన్, సుమలత, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు గోదాంలు



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ గోదాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఐదు దశాబ్దాల క్రితం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీటిని నిర్మించారు. కాగా ఏళ్ల కాలంగా వినియోగించక, నిర్వహణ కొరవడి నిరూపయోగంగా మారాయి. క్రమంగా రేకులు, గోడలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. స్వల్ప మరమ్మతులు చేస్తే గోదాంలు వినియోగంలోకి వస్తాయి. సింగిల్ విండోకు కూడా అనువైన గోదాం లేదు. వీటిని మరమ్మతు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- ఆమనగల్లు, మే 9 (ఆంధ్రజ్యోతి)

ప్రైవేటుకు దీటుగా సర్కార్ బడుల్లో బోధన

- డీఈవో సుశీంద్రరావు



దేవేందర్‌నగర్ కాలనీలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఈవో

మహేశ్వరం, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరుగుతుందని డీఈవో సుశీంద్రరావు అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని దేవేందర్‌నగర్ కాలనీ, తుక్కుగూడ, సర్దార్‌నగర్ పాఠశాలల పరిధిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఆధ్వర్యంలో ర్యాలీలు తీశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు శ్రమించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతీ పాఠశాలకు ఐదు చొప్పున కంప్యూటర్లు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనను కూడా ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కస్నానాయక్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, జంగయ్య, పాండురంగం, శంకర్, ఆంజనేయులు, బుగ్గరాములు, వెంకటేష్, ప్రమీల, పద్మజ, ధనలక్ష్మి, కవిత, అనసూయ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ఎరువుల వాడకం తగ్గించాలి

● వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

మేడ్చల్‌టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) ఎరువుల వాడకం తగ్గించి నేల తల్లి కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ రైతుపై ఉందని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయశాఖ శాస్త్రవేతలు అన్నారు. మండలంలోని మేడ్చల్, రాయిలాపూర్, గుండ్లపోచంపల్లి, అక్బర్జపేట గ్రామాల్లో రైతుల ముంగిట శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన పలువురు శాస్త్రవేతలు మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకర పంటలను పండించాలన్నారు. వ్యవసాయంలో సాగు నీటి పొదుపు ఉండాలని, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రజ్ఞులు డాక్టర్ వి. వరప్రసాద్, డాక్టర్ వసంత, డాక్టర్ పుష్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలి

● వీరజవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌లకు ఘన నివాళి
● మైసిగండిలో భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ
● పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు, గిరిజనులు

కడ్తాల్, మే9(ఆంధ్రజ్యోతి): దేశంకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు దేశ ప్రజలంతా అండగా నిలవాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో వీరమరణం పొందిన మురళీనాయక్, సచిన్‌యాదవ్‌లకు శుక్రవారం కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, యువజనకాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు హీరాసింగ్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జవహర్‌లాల్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు, గిరిజన యువకులు పెద్దసంఖ్యలోపాల్గొన్నారు. మురళీనాయక్, సచిన్ యాదవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులర్పించారు.హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి భారత సైన్యానికి సంఘీభావం ప్రకటించారు. శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ పాకిస్థాన్‌తో భారత సైన్యం వీరోచితంగా పోరాడుతోందని కొనియాడారు. యువజన కాంగ్రెస్ తాలుకా అధ్యక్షుడు దళపతి గౌడ్, నాయకులు తులసీరామ్ నాయక్, కిషన్‌నాయక్, సీతారామ్, ప్రవీణ్, నర్సింహ, జగన్, అంజనేయులు, బాబులాల్, భీమ్‌జీ, రమేశ్, గోపాల్, మల్యా, హర్యా, శంకర్, లస్కర్ నాయక్ పాల్గొన్నారు.


మైసిగండిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

మురళీనాయక్ త్యాగం మరువలేనిది

షాద్‌నగర్ అర్బన్: పాకిస్థాన్‌తో పోరాటంలో వీరమరణం చెందిన జవాన్ మురళీనాయక్ త్యాగం దేశం మరువబోదని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్‌నాయక్ అన్నారు. ఈమేరకు శుక్రవారం రాత్రి రాంబల్‌నాయక్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో కొవ్వొత్తులను వెలిగించి, మురళీనాయక్‌కు నివాళులర్పించారు. రాంబల్‌నాయక్ మాట్లాడుతూ మురళీనాయక్ కుటుంబానికి భారత ప్రజలు, ప్రభుత్వాలు అండగా ఉంటారని అన్నారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దీటుగా జవాబు ఇస్తున్న భారత సైన్యానికి కులమతాలకతీతంగా భారతీయులందరూ అండగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రామావత్ రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, భద్రునాయక్, చందునాయక్, అయోధ్య శ్రీనివాస్‌నాయక్, చందర్‌నాయక్, పరుశురాంనాయక్, అంబదాస్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

ఇండో గ్లోబల్ అవార్డు గ్రహీతకు సన్మానం

పరిగి, మే9 (ఆంధ్రజ్యోతి): ఇండోగ్లోబల్ అవార్డు గ్రహీత దోమ మండలం బొంపల్లి పాఠశాల హెచ్‌ఎం ఎండీ షఫీని ముస్లిం, మైనార్టీ ఎంప్లాయీస్ వర్కింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎంఈడబ్ల్యుఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహిజ్‌ఖాన్, ఎండీ జహంగీర్, ప్రధానోపాధ్యాయులు ఎండీ ఉస్మాన్‌అలీలు మాట్లాడుతూ ఈ అవార్డును అందుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఉద్యోగుల సంఘం నాయకులు నజీర్, ఇసాక్, ఖాజాషరీఫ్, ఇబ్రహీం, కాషీం, జలాల్ ఉన్నారు.


హెచ్‌ఎం షఫీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ప్రైవేట్ భూముల విలువ ప్రకారం
పరిహారం చెల్లించాలి

● గ్రామసభలో అధికారులను కోరిన భూనిర్వాసితులు



గ్రామసభలో మాట్లాడుతున్న శ్యాంప్రకాశ్

శామీర్‌పేట, మే9 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారి విస్తరణలో తూంకుంట పరిధిలో ప్రైవేట్ భూముల విలువ ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని భూనిర్వాసితులు అధికారులను కోరారు. జేబీఎస్ నుంచి తూంకుంట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ప్రభుత్వం తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ రాష్ట్ర రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లను కోల్పోతున్న భూనిర్వాసితులతో శుక్రవారం తూంకుంట, హకీంపేటలో అదనపు కలెక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో పునరావాసానికి సంబంధించి గ్రామసభలను నిర్వహించారు. రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణ కోసం 200 ఫీట్ల స్థలాన్ని కేటాయించకుండా 100 ఫీట్ల మేరకే తగ్గించి రోడ్డును వెడల్పు చేయాలని భూనిర్వాసితులు అధికారులను కోరారు. ఓ ప్రక్క రాజీవ్‌రహదారి విస్తరణలో ఇళ్లను, స్థలాలను కోల్పోతున్న బాధలో తాముంటే తూంకుంట మున్సిపల్ అధికారులు పన్నులను చెల్లించాలని వేధిస్తున్నారని పలువురు భూ నిర్వాసితులు మొరపెట్టుకున్నారు. అదనపు కలెక్టర్ హరిప్రియ మాట్లాడుతూ రాజీవ్‌రహదారి విస్తరణలో భూ నిర్వాసితుల సమస్యలను, సందేహాలను ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి తగు చర్యలను తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా సభలో జిల్లా భూసేకరణ ఇన్‌చార్జి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్యాంప్రకాశ్, భూసేకరణ ఇన్‌చార్జి తహసీల్దార్ విజయకుమార్, మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను వివరించారు.

ఎన్డీఎఫ్‌కు ఆర్బీఎల్ విరాళం

తాండూరు, మే9 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం మేముసైతం అంటూ తాండూరు ఆర్బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగులు ముందుకొచ్చారు. సైనిక కుటుంబాల సంక్షేమానికి జాతీయ రక్షణ నిధికి రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు. భారత సైనిక కుటుంబాల సంక్షేమం కోసం భారతసైన్యం ఏర్పాటు చేసిన ఎన్డీఎఫ్‌కు తన బాధ్యతగా ఈవిరాళాన్ని అందజేసినట్లు ఆర్బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మామిడి ఘుమఘుమలు

జిల్లాలోని మార్కెట్లలో జోరుగా మామిడి పండ్ల విక్రయాలు.. తగ్గిన ఉత్పత్తులు.. ప్రియంగా ధరలు

పరిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): నోరూరించే బంగినపల్లి మామిడి పండుకు మార్కెట్‌లో ఎంత పేరుందో... రాజధాని శివారులోని పూడూరు బేనిషాన్‌కు అంతే పేరుందనడం అతిశయోక్తి కాదు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పండ్లలో ప్రధానమైనది మామిడి పండు. వేసవిలో నోరూరించే పండుగా భావిస్తున్న మామిడి పండు తినాలని ప్రతిఒక్కరూ ఆసక్తి చూపుతారు. మాటు వేసిన మామిడి పండ్ల ప్రాంతలో గుమగుమ వాసనలు వెదజల్లుతాయి.



జిల్లాలోని 20మండలాల్లో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. గత పదేళ్ల నుంచి జిల్లాలో మామిడి తోటల పెంపకం పెరుగుతున్నది. ఏరైతు చూసినా తమకు ఉన్న పొలంతో కొంతనైనా మామిడి తోటలను పెంచాలని మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పరిగి, వికారాబాద్, తాండూరు మార్కెట్లలో మామిడి పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా పూడూరు మామిడి తోటలకు ప్రసిద్ధిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ పండించిన పండ్లను రాజధాని హైదరాబాద్ నగరమే కాకుండా రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలోని మార్కెట్‌లలో కూడా పూడూరు ఎంతో ప్రసిద్ధి. మామిడి పూత వచ్చే సమయంలో అనుకూలించని కాలం కారణంగా ఈసారి కాత ఆశించిన విధంగా లేక ధరలు కూడా భగ్గుమంటున్నాయి. జిల్లాలోని ఒక్క పూడూరు మండలంలో నాలుగు వేల ఎకరాల్లో సాగు ఉండగా, మిగతా మండలాల్లో మరో 10వేలకుపైగా మామిడి తోటలు సాగులో ఉంది.

మామిటి పండ్లకు కేరాఫ్ పూడూరు

జిల్లాలోనే మామిడిపండ్లకు పూడూరు మండలమే కేరాఫ్‌గా నిలుస్తున్నది. ఇందులో ముఖ్యంగా పూడూరు మండలం పూడూరు, మన్నెగూడ, రాకంచర్ల, పెద్ద ఉమ్మెంతాలలో మామిడి తోటలో అనేక రకాల పండ్లు లభ్యమవుతాయి. రాకంచర్లతోట నుంచి మామిడి పండ్లను హైదరాబాద్‌తో పాటు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు.

మార్కెట్‌లో లభిస్తున్న పండ్లు

ఫలాల్లో రారాజు అయిన మామిడి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కాపు తక్కువగా ఉంది. దీంతో ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది రకాలను బట్టి కిలో చొప్పున రూ.100 నుంచి రూ.180ల వరకు పలుకుతోంది. హిమాయత్-160, కేసరి-90, గోవా-90, మహిముద-100,


పూడూరు మన్నెగూడలో మామిడిపండ్ల అమ్మకాలు

పంచదార-90, బేనిషాన్-90, ఆపూస్-90, పెద్దరసాలు-100, చిన్నరసాలు-90, సపేద-90, జాంగీర్-90, దశరిమహిముద-90, చెరకు రసాలు-90, మల్గోబా90, మంజీర-90, మలెక-90, లంగ్ద-90, తోటాపరి-90 రూపాయలు పలుకుతున్నాయి.

మామిడి పండ్ల ధరలు పెరిగాయి



ఈసారి మామిడి పండ్ల ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది కంటే ఈసారి కిలోపై రూ.30 నుంచి రూ.50లు ఎక్కువగా ఉన్నాయి. పరిగి మార్కెట్‌లో కిలో రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. ధరలను చూస్తే ఆలోచించాల్సి వస్తుంది.

\- విజయలక్ష్మి, పరిగి

కార్బైడ్‌తో మాగిన పండ్లు తినొద్దు



మామిడి పండ్లు మంచి కలర్‌లో కనిపించడానికి కార్బైడ్‌తో పాటు, ఇతర రసాయనాలు వాడుతున్నారు. ఇలా రసాయనాలు చల్లిన మామిడి పండ్లను తినడం ద్వారా రోగాలపాలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవిలో ఇలాంటి పండ్లు తినడం వల్ల విరేచనాలకు గురికావచ్చు. ఇతర దీర్ఘకాలిక వ్యాధులు కూడా రావొచ్చు. కార్బైట్‌తో కాకుండా నేచురల్‌గా లభించే పండ్లనే తినాలి.

\- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి


గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

సిటిజన్ లాగిన్ విన్నపాలపై స్పందించాలి

- జిల్లా పంచాయతీ అధికారి జయసుధ
- అగ్గనూరు, దేవనూరు పంచాయతీల తనిఖీ

యాలాల, మే 9, (ఆంధ్రజ్యోతి): సిటిజన్ లాగిన్‌లలో వచ్చిన విన్నపాలను ఆలస్యం చేయకుండా స్పందించి పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆదేశించారు. మండలంలోని అగ్గనూరు, దేవనూరు పంచాయతీలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం జయసుధ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను శాస్త్రీయంగా తయారు చేసే మొక్కల పెంపకాలకు, వివిధ పంటలకు, కూరగాయల పంటలకు ఉపయోగించాలని సూచించారు. అధికంగా ఎరువులు తయారు చేసి హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణ ప్రాంతాలకు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తడి, పొడి చెత్త వేర్వేరు చేయించే విధానంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు. గ్రామంలో అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులను గుర్తించాలన్నారు. మండలంలో కొత్తగా పేర్కంపల్లితండా, దేవులతండాలో కంపోస్టు నిర్మాణానికి తీర్మానాలను పంపాలని ఆదేశించారు. ఎంపీడబ్ల్యూ వర్కర్లతో పంచాయతీ అధికారి మాట్లాడుతూ ఇనూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆలస్యం కాకుండా వేతనాలు చెలల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలీల, వ్యవసాయాధికారి శ్వేత, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, పావని, సుధాకర్, తారకాచారి పాల్గొన్నారు.

నాలుగు బ్లాకులుగా 'మహేశ్వరం కాంగ్రెస్'

- బ్లాక్-1లో ఆర్కేపురం, సరూర్‌నగర్, 2లో మీర్‌పేట్, బడంగ్‌పేట్ 3లో తుక్కుగూడ, జల్‌పల్లి, 4లో మహేశ్వరం, కందుకూరు



మహేశ్వరం, మే 9(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గాన్ని పార్టీపరంగా నాలుగు బ్లాకులుగా విభజించామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. జీహెచ్‌ఎంసీలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజనల్లను కలుపుకొని మొదటి బ్లాకుగా, మీర్‌పేట్, బడంగ్‌పేట్ రెండో బ్లాకు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలను కలుపుకొని మూడో బ్లాకు, మహేశ్వరం, కందుకూరు మండలాలను కలుపుకొని నాలుగవ బ్లాకుగా విభజించామని ఆయన తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకోవడంతో పాటు పదవుల పంపకంలో కాంగ్రెస్ పైరవీలను ప్రోత్సహించదన్నారు. ఈమేరకు తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం, పార్టీ బలోపేతానికి కష్టించి పనిచేయాలనుకొని ముందుకెళ్లేవారు పార్టీ అధ్యక్ష బ్లాక్, డివిజన్, మండల, గ్రామ శాఖల అధ్యక్షులతో పాటు ఇతరాత్రాఆ పదవులను ఆశించే నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాన్ని నాలుగు బ్లాకులుగా విభజించిన విషయాన్ని గమనించాలన్నారు. ఈమేరకు పదవులు ఆశించే వారు పార్టీ కార్యాలయంలో తమ పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీ ఆదేశాలను కాదని.. పైరవీలతో ఎవరు ముందుకు వెళ్లినా.. ఎలాంటి పదవులు రావనే విషయాన్ని గమనించాలన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి పదవులు తగిన సమయంలో తప్పకుండా వస్తాయని కేఎల్లార్ ఈ సందర్భంగా తేల్చి చెప్పారు.


తుర్కగూడ ఎస్సీ కమ్యూనిటీ భవనం వెనకాల గుంత ఇలా..

పొంచి ఉన్న ప్రమాదం!

ఆదిభట్ల, మే 9(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తుర్కగూడ గ్రామంలో ఇటీవల తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయ్యి నెలరోజులు గడుస్తున్నా ఎస్సీ కమ్యూనిటీ భవనం వెనకాల తవ్విన గుంతను కాంట్రాక్టరు పూడ్చలేదు. దాంతో గుంత ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వం చర్లపటేల్‌గూడ నుంచి రాచులూర్ వరకు కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తుర్కగూడ, కప్పాడు గ్రామాలకు చెందిన ప్రజలు ఎర్రగుంట రోడ్డు నుంచి తుర్కగూడ చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం వెనుకాల తవ్విన గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణ

నిర్భయంగా వ్యాపారాలు.. రోడ్ల విస్తరణకు ఆక్రమణలను తొలగించినా మళ్లీ యథాస్థితి

ఇరుకు రోడ్లతో తరచూ ట్రాఫిక్.. ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు

ఆమనగల్లు, మే9 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని రోడ్లను నిర్భయంగా ఆక్రమించేస్తున్నారు. రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారుల మొదలు, దుకాణదారుల వరకు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లను ఆక్రమించి వ్యాపారం సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. రోడ్డు వెంట వ్యాపారం సాగించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో పాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆమనగల్లు పట్టణం రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండి నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉంది. దీంతో వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతుండడంతో స్థానికులతో పాటు చుట్టు పక్కల మండలాల వారు బతుకుదెరువు కోసం ఆమనగల్లుకు వచ్చి ఏదో ఒక చిరు వ్యాపారం సాగిస్తున్నారు. దుకాణాల అద్దెలు చెల్లించలేక విధిలేక రోడ్ల పక్కనే షెడ్లు, డబ్బాలు, కొట్లు, ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దీంతో రోడ్ల ఆక్రమణ నానాటికి అధికమవుతుంది. ప్రదానంగా శ్రీశైలం - హైద్రాబాద్ జాతీయ రహదారి నుంచి మాడ్గుల మండల కేంద్రానికి, గాంధీ చౌక్ నుంచి గ్రామ పంచాయతీ మీదుగా పాత బజార్‌కు వెళ్లే రోడ్డు, రాజీవ్ చౌక్ నుంచి బస్టాండ్ మీదుగా షాద్‌నగర్ వెళ్లే రోడ్డు ఆక్రమణలతో పూర్తిగా కుచించుకుపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. రాజీవ్ చౌరస్తా మూలమలుపు నుంచి గాంధీచౌక్ వరకు గల రోడ్డు ఇటీవల ఆక్రమణలు అధికమయ్యాయి. బాలుర ఉన్నత పాఠశాల



వైపు చిరు వ్యాపారులు కొట్లు, చిన్న చిన్న వ్యాపారులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు... దీనికి తోడు వివేకానంద విగ్రహం వైపు కూడ కొందరు పండ్లు, పోలీస్ స్టేషన్ వెనుక చేపలు, గాంధీ చౌక్ వద్ద కూరగాయల మార్కెట్లు, ప్రైవేట్ వాహనాల, ఆటోల పార్కింగ్‌తో ఎదురెదురుగా వాహనాలు వస్తే కదలలేని పరిస్థితి ఏర్పడింది. అసలే వ్యాపారుల ఆక్రమణలతో రోడ్డు ఇరుకుగా మారగా, దానికి తోడు కొనుగోలు దారులు, ప్రయాణికులు రోడ్లపక్కనే వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. రోడ్ల నిర్వహణ సరిగాలేక, చిరు వ్యాపారులు మలిన పదార్థాలు, చెత్త రోడ్లపైనే పారబోస్తున్నారు. గాంధీ చౌక్ వద్ద ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది. సంతరోజు శుక్రవారం ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. షాద్‌నగర్‌రోడ్డు పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అదే రోడ్డులో బస్టాండ్ వైపు వాహనాల పార్కింగ్‌తో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లలేని పరిస్థితి. బస్టాండ్ దుకాణాల మందు వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారుల ఆక్రమణల మూలంగా ఈ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. అదేవిధంగా శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిని కూడా నిర్భయంగా ఆక్రమిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నా ఎవరికీ పట్టింపు లేదు. రోడ్డు విస్తరణలో ఆక్రమణలను తొలగించిన మళ్లీ ఇటీవల యథాస్థితి పరిస్థితి నెలకొంది. పండ్ల వ్యాపారులు, పూల దుకాణదారులు, టీకొట్లు, టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్లవారు రోడ్డును పావు వంతు ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తుండడం.. వాటి ముందు ఇష్టానుసారం వాహనాలకను పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకొని ఆక్రమణలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


ఆక్రమణలతో ఇరుకుగా మారిన మాడ్గుల రోడ్డు

రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు..



రోడ్ల ఆక్రమణలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలా వరకు రోడ్ల విస్తరణ కోసం ఆక్రమణలను తొలగించడం జరిగింది. చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దు. పలు చోట్ల ఆక్రమణల తొలగింపునకు ఉన్నతాధికారులకు నివేదించాం. దుకాణాల ఎదుట వాహనాలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇస్తాం.

శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్, ఆమనగల్లు

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



శంషాబాద్ రూరల్ : జూకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జూకల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు మాట్లాడుతూ రైతులు యూరియా తక్కువ వాడాలని, సాగు ఖర్చును తగ్గించుకోవాలని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించాలన్నారు. పంట మార్పిడితో తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ లాభం వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. పాల్మాకుల పీఎస్‌సీఎస్ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, ఏడీఏ కవిత, ఏవో శ్వేత, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తక్కువగా వాడాలి

ఇబ్రహీంపట్నం: అవసరం మేరకే రసాయన ఎరువులు వినియోగించి భూసారాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాములు నాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోల్కంపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరై వ్యవసాయంలో పాటించే మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. బిందు, తుంపర సేద్యంతో ఉద్యానవన పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని విధిగా పాటించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సునీత, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ ప్రాంతం హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్నందున కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. ఏవో విద్యాధరి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టామని, భూమి కలిగి ఉన్న రైతులందరూ దీనిని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఏఈవోలు వైశ్రవణ్‌కుమార్, సృజన రైతులు పాల్గొన్నారు.

విరబూసిన చెట్టు



మండు వేసవిలో చెట్ల ఆకులన్నీ రాలిపోయి చెట్లు మొత్తం విరబూసి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దుద్యాల రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులకు నీడనిస్తున్నాయి. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్న కూడా రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా చెట్లకు పూసిన పుష్పాలు ప్రయాణికులకు అబ్బురపరుస్తున్నాయి.

దుద్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి)

జోరుగా మట్టి దందా

సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు.. పట్టించుకోని అధికారులు


జేసీబీ సహాయంతో మట్టిని టిప్పర్‌ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

మోమిన్‌పేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారం గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లోకి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతు పట్టాభూమి సర్వే నం.225లో నుంచి దర్జాగా టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. మోమిన్‌పేట్ నుంచి తాండూర్‌కు వెళ్లే రోడ్డు సమీపంలో ఉన్న గుట్టను యంత్ర పరికరాలతో పెకిలించి వెంచర్‌లో అంతర్గత రోడ్లకు పోస్తున్నారు. దాదాపు 6 నుంచి 7 వెంచర్లు గ్రామ సమీపంలో వెలిశాయి. ఈ విషయంపై వెంచర్ సూపర్‌వైజర్‌ను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. మైనింగ్ శాఖ నుంచి అనుమతులున్నాయా అని అడిగితే లేవని సమాధానం దాటవేశారు. మండలంలోని కేసారం, దేవరంపల్లి, చీమలదరి, రావుల్‌పల్లి, మేకవనంపల్లి, మోమిన్‌పేట్, కొత్తకొల్కుంద, ఎన్కతల, గోవిందాపూర్, చక్రంపల్లి, టేకులపల్లి గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పార్టీకి చెందిన నాయకులదని సమాధానం చెబుతున్నారు.



గుట్టల నుంచి మట్టి తరలింపు

వెంచర్ల కోసం సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టలను నేల మట్టం చేస్తున్నారు. గోవిందాపూర్ గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యామ్ మధ్య నుంచి దర్జాగా తన పొలం వరకు వెళ్లేందుకు రోడ్డు వేశాడు. చుట్టుపక్కల రైతులు అడిగితే అందరికీ వెళ్లేందుకు ఉపయోగపడుతుందని సమాధానం చెబుతున్నాడు. 15 రోజుల క్రితం ఎన్కతల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి చిన్నచెరువు సమీపంలోని శిఖం కబ్జా చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని గ్రామస్తులు స్పీకర్ దృష్టికి తీసుకెళ్తే ఇరిగేషన్, రెవెన్యూ శాఖ సిబ్బంది సహాయంతో కబ్జా నుంచి శిఖం భూమిని కాపాడారు. మోమిన్‌పేట్ మండలంలోని గుట్టలను జేసీబీలతో పెకిలించి మట్టిని వెంచర్లకు మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ వివరణ కోరగా అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం వస్తే చట్టరీత్య చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి

ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు

ఆమనగల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, డైరెక్టర్లు అంజయ్య, శ్రీశైలంలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. కొనుగోలు తీరును పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన శిబిరాన్ని పరిశీలించి రైతులకు భోజనం వడ్డించారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, నాయకులు పర్వతాలు, వెంకట్‌రెడ్డి, ఖాదర్, శ్రీధర్‌రెడ్డి, కండె సాయి, మహేశ్, శ్రీను నాయక్, గౌస్, కొప్పు విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'కష్టపడిన కార్యకర్తలకే పదవులు'

చేవెళ్ల, మే 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకే పదవులు ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు ఎ.వీరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీలో పెద్దపీట వేశామన్నారు. ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలు పదవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కొందరు కావాలనే బీఆర్ఎస్, బీజేపీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారని ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. ఎమ్మెల్యేపై లేనిపోని విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులిచ్చినట్లు నిరూపిస్తే చర్చకు సిద్ధమన్నారు. ఎమ్మెల్యే యాదయ్య నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెప్పుడో?

- రెండేళ్లుగా సాగుతున్న తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు పనులు
- కంకర రాళ్లతో వాహనదారుల ఇక్కట్లు
- తరచూ ప్రమాదాలు.. పట్టని అధికారులు



రోడ్డుపక్కన గోతిలో పడిన కారు (ఫైల్)



కంకర వేసి వదిలేసిన తుమ్మలూరు రోడ్డు

మహేశ్వరం, మే 9(ఆంధ్రజ్యోతి): తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు విస్తరణ పనులు ముందుకెళ్లకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం-హైదరాబాదు ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగడంతో సుమారు రెండు సంవత్సరాలుగా ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణ పనుల కోసం 5 కిలో మీటర్లకుగాను రూ.14 కోట్లు విడుదల చేసింది. ప్రారంభంలో పనులు వేగవంతంగా చేపట్టిన కాంట్రాక్టర్ ఆ తరువాత నిర్లక్ష్యం చేశారు. దాంతో తుమ్మలూరు, మహేశ్వరం ప్రజలే కాకుండా రెండు జాతీయ రహదారులైన శ్రీశైలం, బెంగళూరు జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు వల్ల ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర రాళ్లపై ప్రయాణం నరకంగా మారిందని వాపోతున్నారు. అంతేకాకుండా దుమ్ముతో ద్విచక్రవాహన ధారులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. కాగా, బెంగళూరు జాతీయ రహదారి నుంచి వచ్చే వాహనదారులు శ్రీశైలం జాతీయ రహదారికి చేరుకోవాలంటే తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు మార్గం తప్పనిసరి. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నా పట్టించుకునే నాధుడే కరవయ్యారు. కొత్త ప్రభుత్వంలోనైనా రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెరుగుతుందా? పెరగదా? అనే అనుమానాలు వాహనదారుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇటీవల తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్‌ను గ్రామ యువత కలిసి మొరపెట్టుకున్నారు.

విస్తరణ పనులు చేపట్టాలి



బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులకు రూ.14 కోట్లు విడుదల చేసినప్పటికీ కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేయడం లేదు. దాంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పనులు ప్రారంభించాలని గ్రామ యువకులు ధర్నాలు చేసినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.

కె.శ్రీహరి, మాజీ ఉపసర్పంచ్, తుమ్మలూరు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న దేవేందర్, కార్మికులు

షాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ చందన్‌వెల్లి ఇండస్ట్రీస్ కన్వీనర్ అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో వలస కార్మికుల యొక్క శ్రమను పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని, కార్మిక శాఖ అధికారులు మొద్దునిద్రలో ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ఫలితంగా 8 గంటల పనిదినం పోయి 12 గంటలకు పెరిగిందని, అతి తక్కువ వేతనంతో వలస కార్మికులతో చందన్‌వెల్లి పారిశ్రామిక వాడ యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని, అనేక ప్రమాదాలు జరిగినా పట్టించుకునే నాధుడే లేకుండా పోయారని వాపోయారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 20న దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల బ్యాంకు ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందన్‌వెల్లి క్లస్టర్ నాయకులు పింటూ, దాస్‌గుప్తా, కుమార్‌యాదవ్, ప్రకాష్ విక్రమ్, మోసంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. అనుమతులు సున్నా

(5వ పేజీ తరువాయి)

మహిళా న్యాయవాదులు అన్నిరకాలుగా ఇబ్బంది పడుతున్నారు.

1946లో హైదరాబాద్ జిల్లా కిందే ఉన్న ఇబ్రహీంపట్నంలో మున్సిఫ్ కోర్టు మాత్రమే ఉండేది. అప్పట్లో ఇది కొన్నేళ్లపాటు ప్రైవేటు భవనంలో కొనసాగింది. 1982లో హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాలను కలిపి రంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేసినప్పటికీ కోర్టు కోసం పక్కా భవనం నిర్మించలేదు. 1990లో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కోర్టు పక్కా భవనం నిర్మించారు. 2002లో అప్పటి టీడీపీ హయాంలో కోర్టు సైబరాబాద్ కమిషనరేట్ కిందకు రాగా, ఇది మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుగా ఏర్పడింది. ఇబ్రహీంపట్నం పాత తాలుకా పరిధిలో అప్పటివరకు ఉన్న ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం మండలాలు ఈ కోర్టు కిందే ఉండేవి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కందుకూరు, మహేశ్వరం మండలాలు విడిపోగా మహేశ్వరంలో కొత్తగా మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేశారు. 2016లో ఇబ్రహీంపట్నంలో సీనియర్ సివిల్ జడ్జి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, 2021లో ఇది రెగ్యులర్ కోర్టుగా మారింది. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పాత భవనంలో నడుస్తోంది.



ఆరుబయట వేచి ఉన్న కక్షిదారులు

అదనపు జూనియర్ సివిల్ జడ్జి, 16వ అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు కక్షిదారులు వేచి ఉండే గదుల్లో నడుస్తోంది. 2024 నవంబర్ 8న అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రారంభం కాగా, ఇది అధికారుల క్వార్టర్‌లో కొనసాగుతోంది. అలాగే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వ్యవసాయ శాఖ గోడౌన్‌లో ఓ రేకుల షెడ్డులో కొనసాగుతోంది. సీనియర్ సివిల్ జడ్జి, అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు మండల పరిషత్ పాత సమావేశ మందిరంలో నడుస్తోంది. ఇక్కడ కోర్టు ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో అదే సంవత్సరం మేలో హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు.

పార్కింగ్‌కూ ఇబ్బందే..

కోర్టుల్లో సౌకర్యాలు లేక అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం కూడా లేదు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. ఇప్పటికే ఈ కాంపౌండ్‌లో పంచాయతీరాజ్, ఈఈ కార్యాలయం, మిషన్ భగీరథ డీఈ కార్యాలయం, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం, మండల మహిళా సెర్ప్ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం, మండల రిసోర్స్ కార్యాలయం, మహిళా మ్యాక్స్ కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాలకు, కోర్టులకు వచ్చేవారి వాహనాలతో ప్రాంగణమంతా నిండిపోతుంది. ప్రాంగణంలో కోర్టులున్న కారణంగా ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం ఉంటే కనీసం మైకొపెట్టి మాట్లాడే పరిస్థితి లేదు.

భవన సముదాయానికి రూ.123 కోట్లు..

ఇబ్రహీంపట్నం కోర్టు భవనాల సముదాయం కోసం ప్రభుత్వం రూ.123 కోట్లు మంజూరయ్యాయి. డీపీఆర్ కూడా సిద్ధం చేసి పంపారు. పరిపాలన అనుమతులు రావాల్సి ఉంది. కాగా, ఇక్కడ చెరువు కట్ట కిందిభాగం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు పక్కన రోడ్డులో ఇబ్రహీంపట్నం ఖాల్సా సర్వే నెంబర్ 815లో కోర్టు భవనాల కొరకు 3.35 ఎకరాలు కేటాయించారు. ఈమేరకు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అధునాతనమైన 12 కోర్టులు, అధికారుల క్వార్టర్లు నిర్మించాలని నిర్ణయించారు.



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలి

ఆమనగల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాఘాయిపల్లికి చెందిన రాయకంటి గిరికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ జ్యోతినిరంజన్, లింగం, చంద్రమోహన్‌రెడ్డి, జోగయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌కు సన్మానం



చేవెళ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడిగా నియమితులైన శ్రీకాంత్‌ను మండల, మున్సిపాలిటీ నాయకులు శుక్రవారం సన్మానించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా యువనాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రవీణ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, అశోక్, అభిషేక్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

'గాలికుంటు' నివారణ టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న దేవిరెడ్డి

మొయినాబాద్ రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి సూచించారు. శుక్రవారం అమ్డాపూర్ గ్రామంలో పాడిపశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను వేయనున్నట్లు దేవిరెడ్డి తెలిపారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల నుంచి పశువులను కాపాడుకునేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. అమ్డాపూర్‌లో నేడు(శనివారం) కూడా టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏస్ రవి, రైతులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



దర్గాకు నైవేద్యం తీసుకెళుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం జహంగీర్ పీర్ దర్గాను సందర్శించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులతో కలిసి దర్గా వద్ద ఫతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, మజీద్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు. అనంతరం కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, ఆనంద్, జగన్, వస్పుల శ్రీశైలం, భూపతిరెడ్డి, బాబా, తాళ్ల రవీందర్, నరేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న టీఎస్ఎస్‌వో నాయకులు

తలకొండపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మీసాల వంశీ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం ఎంఈవో చంప్లా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహించడమే కాకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతుల్లేని స్కూళ్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వంశీ హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు తుమ్మ నితీశ్ వర్మ, శ్రీకాంత్, శ్రీశైలం, సందీప్,లోకేశ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

శంకర్‌పల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ఆర్థిక కారణాలతో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు ప్రయత్నించిన రాజేందర్‌రెడ్డి అనే నిందితుడికి శుక్రవారం చేవెళ్ల కోర్టు న్యాయమూర్తి దశరథరామయ్య ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈమేరకు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం గాజులగూడ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, రాజేందర్‌రెడ్డిల మధ్య డబ్బుల విషయంలో విబేధాలు తలెత్తాయి. ఈక్రమంలో దుర్గాప్రసాద్‌ను ఎలాగైనా హత్య చేయాలని భావించిన రాజేందర్‌రెడ్డి 2024 ఫిబ్రవరి 10న ఆసుపత్రికెళ్లి వద్దామని చెప్పి దుర్గాప్రసాద్‌ను బైక్‌పై ఎక్కించుకున్నాడు. గాజులగూడ గ్రామం దాటగానే మార్గమధ్యలో అకస్మాత్తుగా బైక్ ఆపి డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని రాజేందర్‌రెడ్డి దుర్గాప్రసాద్‌ను ప్రశ్నిస్తూ అతడి తలపై రాయితో బలంగా బాదాడు. దాంతో దుర్గాప్రసాద్ మృతిచెంది ఉంటాడని భావించిన రాజేందర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన దుర్గాప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తరువాత అతడి ఆరోగ్యం కుదుటపడింది. హత్యాయత్నానికి పాల్పడిన రాజేందర్‌రెడ్డికి చేవెళ్ల కోర్టు న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె, మేకపిల్ల మృతి

కందుకూరు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులమైలారం గ్రామంలో శుక్రవారం ఉదయం గొర్రెతో పాటు మేకపిల్లపై వీధికుక్కలు దాడిచేసి చంపుకుతిన్నాయి. బండారి జంగయ్య వ్యవసాయ పొలం వద్ద గొర్రె, మేకపిల్లను పెంచుకుంటున్నాడు. ఈక్రమంలో ఉదయం పాలు పితకడానికి వెళ్లేసరికి పది వీధికుక్కలు గొర్రెతో పాటు మేకపిల్లను చంపుకుతిన్నాయి. గొర్రె, మేకపిల్ల విలువ దాదాపు రూ.5వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కవిత శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5నుంచి 20వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఎంపికైన విద్యార్థుల జాబితాను 26న కళాశాల నోటీసు బోర్డులో ఉంచనున్నామ పేర్కొన్నారు. మే 27 నుంచి 31వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణ, ప్రవేశ ప్రక్రియ పూర్తవుతుందని, సీట్ల కేటాయింపు టెన్త్‌లో మెరిట్, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఆధారంగా ఉంటుందని, ఎంపికైనవారికి ఆంగ్లమాధ్యమంలో ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఈఏపీసీఈటీ, నీట్ కోచింగ్, కెరీర్ కౌన్సెలింగ్, బాలికలకు హాస్టల్ సౌకర్యం, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, బ్యూటీ, వెల్‌నెస్ కోర్సులు, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్, పని గంటలకు మించి సహపాఠ్య కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశాలు కల్పిస్తారని, మరిన్ని వివరాలకు తెలంగాణ మోడల్‌స్కూల్, కళాశాల వెబ్‌సైట్‌లో గానీ, మోడల్ స్కూల్‌లో గానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఆదిభట్ల : ర్యాలీలో ఉపాధ్యాయులు, తదితరులు



మొయినాబాద్ రూరల్ : నాగిరెడ్డిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో మల్లయ్య

ఆమనగల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో పాండు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఎస్సీ కాలనీ, శ్రీకాంత్‌కాలనీ, ఉదయ్ నగర్ కాలనీల్లో ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడారు. సీఆర్పీలు కిషన్, టీచర్లు ఉన్నారు.



ఇబ్రహీంపట్నం : తల్లిదండ్రులను కలిసిన హెచ్ఎం నందిత, టీచర్లు

ఆదిభట్ల : ఐదేళ్లు నిండిన బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదిభట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్కల పరమేష్ కోరారు. మున్సిపల్ పరిధిలోని 1, 9వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. టీచర్లు లక్ష్మీదేవి, భాషయ్య, అంగన్‌వాడీ టీచర్ బేబి పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని గట్టిప్పలపల్లిలో హెచ్ఎం వెంకటయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ నాయకులు, టీచర్లు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి బడిబయటి పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, డేవిడ్, శివశంకర్, రేణురెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని నాగన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నందిత అన్నారు. ఉపాధ్యాయులతో కలిసి నాగన్‌పల్లిలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు పొగాకు సురేష్‌లు బస్తీలకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలన్నారు. 11 మంది విద్యార్థులు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు.

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మన్‌మర్రి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసప్ప అన్నారు. మన్‌మర్రిలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులున్నారు.

మొయినాబాద్ రూరల్ : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి మల్లయ్య తల్లిదండ్రులకు సూచించారు. నాగిరెడ్డిగూడలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం శ్రీరాములు, టీచర్లు పాల్గొన్నారు.

వరికే అగ్రస్థానం!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించగా, ఈ సారి 1,29,088 ఎకరాలకు పరిమితం చేశారు. అంటే దాదాపు 48వేల ఎకరాల పత్తి సాగును తగ్గించారు. వరి సాగు పెరగగా.. పత్తితో పాటు మొక్కజొన్న, కంది, జొన్న, వేరుసెనగ ఇతర పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గించడం గమనార్హం. వాస్తవానికి గత ఏడాది వానాకాలంలో భారీగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించినప్పటికీ ఆ మేర పంటలు సాగు జరగలేదు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 3,96,899 ఎకరాల్లో వివిధ పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇందులో 82శాతం మాత్రమే రైతులు సాగు చేశారు. దీంతో ఈ ఏడాది వ్యవసాయ ప్రణాళికలో వివిధ పంటల సాగును తగ్గించారు. ఇదిలా ఉంటే వానాకాలం సీజన్ సమయం దగ్గర పడుతుండడంతో సీజన్‌కు సరిపడా విత్తనాలు, రసాయన ఎరువుల నిల్వలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎరువులతో పాటు విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో దాదాపు 43,917 క్వింటాళ్ల విత్తనాలు, 72,200 టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచారు.

విత్తన నిల్వల లక్ష్యం

పంట	విత్తన నిల్వలు (క్వింటాళ్లలో)
వరి	35,059
మొక్కజొన్న	6,220
కందులు	630
జీలుగ	280
జొన్న	276
పత్తి ప్యాకెట్లలో (450గ్రా)	3,22,720 145224

రసాయన ఎరువుల నిల్వల ప్రణాళిక (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువులు	నిల్వలు
యూరియా	30,000
డీఏపీ	10,000
ఎస్ఎస్‌పీ	1,000
ఎంవోపీ	1,200
కాంప్లెక్స్	30,000
మొత్తం	**72,200**

అందుబాటులో విత్తనాలు, ఎరువులు : డీఏవో

వానాకాలం పంటలకు వ్యవసాయశాఖ పూర్తిగా సన్నద్ధమైందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. ఈ ఏడాది వానాకాలం 3.47లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేసేందుకు రైతులను సమాయత్తం చేస్తున్నామని చెప్పారు. వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. ఇప్పటికే వివిధ పంటలకు సంబంధించి 43,970 క్వింటాళ్ల విత్తనాలు, 72,200 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని వివరించారు. భూసారం పెంచేందుకు పంటలకు ముందు వేసే జీలుగ, జనుము పంటలకు సంబంధించిన విత్తనాలను ఈ ఏడాది కూడా సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు. రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను జిల్లాలో డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల్లో వీటిని త్వరలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.